

# ఈమె మీకు తెలుసా?

కుముదిని భర్త చంద్రశేఖర్‌కి బ్రూక్‌బాండ్ కంపెనీలో వుద్యోగం. ఇంటి అద్దె కంపెనీవారే పెట్టుకుంటారు. దానికి పరిమితి వున్నది. అపార్ట్‌మెంట్ నచ్చటమేగాక పరిసరాలు బాగున్నాయి. నాలుగంతస్తుల భవనం. కారు పెట్టుకునే సౌకర్యం, లిఫ్టూ, వాచ్‌మన్, ఫెన్సూ, బస్‌స్టాప్ దగ్గరే. డిపార్ట్‌మెంటల్ స్టోర్, మిల్క్ బూత్, కళ్లజోడు షాపు, నేత్రవైద్యుడు, కూరల అంగడి, సినిమా హాలు, మెయిన్‌రోడ్ దగ్గరే. పిల్లల చదువులకి యిబ్బంది లేదు. అపార్ట్‌మెంట్ ఆక్రమించాడు.

సెటిల్ కావటానికి పక్షం పట్టింది. అంతా వారి వారి పన్లమీదా, చదువులకీ వెళ్లారు. కుముదిని గోడలు డెకరేట్ చేస్తున్నది. బెల్ వినబడింది. కిటికీ కింకా కర్టెన్ కట్టలేదు. చూస్తే స్త్రీయే. తలుపు తీసింది కుముదిని.

''లోపలికి రండి పిన్నీ. ఇలా సోఫాలో కూచోండి. తీరిక చిక్కినప్పుడల్లా గోడలు అలంకరిస్తున్నా. ఫొటోలు, పఠాలు, చిత్రాలు, బొమ్మలు, పెయింటింగ్స్. ఈ జాలరు బాగుందా పూసలతో తయారు చేశా. ఇది ద్వారానికి. ఇంకా క్రాస్‌స్టిచ్ చేసిన కర్టెన్సున్నాయి. నేనే కుట్టాను. ఆ సూదివేరు. మెషీన్ మీద కుట్టిన డోర్ కర్టెన్సూ, గలీబులూ, బెడ్‌షీట్సూ వున్నాయి. కిట్ యిస్తాడు. ఉషా సెంటర్లో నేర్చుకున్నా''.

పిన్ని సుమిత్రాదేవి సుఖాసీనురాలై చూపేవన్నీ ఆసక్తిగా చూస్తున్నది. ''అన్నీ బాగున్నాయి అమ్మాయీ'' అని గోడవంక చూసింది. '' ఆ ముఖచిత్రంలో వున్నామె మీకు తెలుసా?'' అన్నది. ''మనం కొత్తగా కలుసుకున్నాము. నేను సెకండ్ ఫ్లోర్‌లో రెండవ నంబరు అపార్ట్‌మెంటులో వుంటున్నాను. నేనూ బాబాయిగారూ యిద్దరమే. పిల్లమేకా వాళ్ల ఫామిలీస్‌తో స్టేట్స్‌కి రెక్కలు రాగానే యెగిరిపోయారు. బాబాయిగారేమో క్లబ్ సెక్రెటరీ. రెడ్‌క్రాస్ కాషియరు. ప్రైవేట్ కోచింగ్‌సెంటర్ ఆనరరీ ప్రిన్సిపాల్. ఇంటిపట్టున వుండేదే తక్కువ. డాన్స్ అండ్

మ్యూజిక్ అకాడెమీ సభ్యులు గూడాను. పేరెన్నికగన్నవారి ప్రోగ్రాములు అరేంజ్ చేస్తారు. సన్నాహాలు చేయిస్తారు. వేదికనెక్కి స్తోత్రపాఠం వల్లిస్తారు. బిజీ బిజీ''. కుముదిని పిన్ని ధోరణి వింటూనే గోడల్ని డెకరేట్ చేస్తూ అనుకున్నది. ''పిన్నిగార్నెక్కడో చూశానే. యెక్కడో కలుసుకున్నానే. కాని గుర్తురావటం లేదు చిత్రంగా. మతిమరుపు యేర్పడింది. అల్జీమర్స్ వచ్చిందేమో ఖర్మ''.

పిన్ని సుమిత్రాదేవి లేచి సాయంపడుతూ వంళ్లాకూచుంటూ కావాల్సినవందిస్తూ నాన్‌స్టాప్‌ధోరణి సాగిపోనిచ్చింది.

''చిత్రమైన సైకాలజీ అమ్మాయీ. మరుపురాదామె తత్త్వం. ఆమె నీకు బంధువా? చొరవతీసుకుంటుంది. హైపర్‌టెన్షన్ వున్నట్లుంటుంది నడవడి. కొద్దిగా వున్మాదమూ రక్తపోటూ గూడా వుండివుండాలి, నిలకడ తక్కువే అనచ్చు. గొప్ప వ్యవహర్త. పదునైన మెదడు మొద్దుబారకుండా అందరి వ్యవహారాల్లో తలదూర్చి టాకిల్ చేస్తుంది. న్యాయశాస్త్రం చదవకపోయినా, లాయరు బల్లకట్టకపోయినా, లాపాయింట్లు నాలుకమీద నాట్యమాడతాయి ఆ ఫొటోలో ఆమెకు. జన్మతః సనాతనిస్టు అయినా అతి ఆధునికంగా లైఫ్ లీడ్ చేయగలదు. నోటిన వడ్డీ కట్టుతుంది. మత చర్చల్లో పాల్గొంటుంది. ఆమెను బాగా స్టడీ చేసిన పెద్దల్లుడు అత్తగారికి డాక్టరేట్ యివ్వచ్చుని శిఫారిస్ చేశాడు తక్కినవారికి. మరికొందరు విశ్వకళాపరిషత్తు సభ్యులు ఆనరరీ డిగ్రీలిచ్చారు''.

కుముదిని సరిగా వినలేదు. పఠంఅతికిస్తున్నది. నాల్గువేపులా ఎడ్హెసివ్ అరేంజ్ చేస్తున్నది.

''దేనికిచ్చారు డాక్టరేటు? యెన్నాళ్లు పట్టింది? థీసిస్ చదివారా? ఆమె పెట్టిందా? యెన్ని పేజీలు?'' అంటున్నది.

''టీనేజరప్పుడే వచ్చింది డాక్టరేట్. థీసిస్ ప్రాక్టికల్స్ పరిశీలనచేసి అల్లుడు అనుమతించమన్నాడు''.

''వైవా మాటేమిటి పిన్నీ?''

''అదీ నల్లేరు మీద బండిలాగా జరిగిపోయింది. యెట్లా చేస్తుందో కానీ నిలువుదోపిడీ చేస్తుంది. చట్రా తనార తీసే నేర్పున్నది. విలవిలలాడి, వలవలా యేడ్చి, కలకలా నవ్వి, బడబడా వాడి, ఊదరపెట్టి, మహాకష్టదశ అని ముక్కు పీక్కుంటూ, మొత్తం లాగేస్తుందత్తగారు. యేంచేసిందీ తెలుసుకునేప్పటికి చేతపైసా వుండదన్నాడల్లుడు. అంతేనా యివ్వక డబ్బున్న సంచీ తాడు వదులు చేయవనుకో, మరో పథకం యిట్టే అమలు చేస్తుంది. అప్పటికప్పుడు ప్రయాణం కట్టి పుణ్య క్షేత్రదర్శనమనో, నదిలో మునకలేయాలనో, సరిగంగ స్నానాలనో, వ్రతమనో, వేడుకలనో సంచీతాడు వూడదీయిస్తుంది. ఆమె వెళ్లాక చూసుకుంటే వట్టి సంచీ వుంటుంది'' అని డాక్టరేట్ యివ్వమని అనుమతించాడు. దాయాది కూతురు కితాబిచ్చింది'' ఛాయిస్ యిస్తుంది పిన్నమ్మ. ఆవిడను చూస్తుంటేనే దడపుడుతుంది నాకు''.

''యెవరినైనా నెత్తినెక్కించనా లేకరాగానే రొక్కంచేతబెడతావా! బాగా ఆలోచించుకునే చెప్పు. నెత్తినెక్కించినవారు దిగిపోకవుుందే యింకా చుట్టాలొస్తారు తండాలాగా. నీవు మూలుగుతూ పడుకున్నా పోరు. వారే వుడకేసుకుంటారు అంటుంది పిన్నమ్మ. గద్ద పైకిపోయినకొద్దీ నేలపై ఆహారం బాగా కనబడుతుందిట. అలాగా పిన్నమ్మ తిరుగుతూ, యెవరినెత్తి ఖాళీగా వున్నదీ, యెవరు వెుతక వునుషులూ అని చూచి, గద్దలాగేవారి రొక్కంతన్నుకుపోతుంది లేదా నెత్తిన మనుషులనెక్కించి పోతుంది'' యెక్కడా వుండలేను. యెవరూ వుండినీయరు'' అని చీదుతుంది.

ఆడబడుచు పెద్దకొడుకు సుబ్రహ్మణ్యం యెర్రరిబ్బన్‌కి యెక్కించిన బంగారు పతకం మెళ్లో వేశాడా ఫొటోలో వున్నావెుకి. '' ఆపదలో ఆదుకోటానికొచ్చినట్టు నటిస్తుంది అత్తయ్య. వంటింట్లో దూరి, వంట అందుకున్నట్టు, అందరికీ వండివారుస్తున్నట్లూ గడబిడ చేస్తూ పన్లుపురమాయించటమేగాక, గృహస్థు తనను గమనిస్తున్నాడా లేదా అని గదుల్లోకి తొంగి చూస్తుంది. ఊరగాయలు పెట్టుకోటం రాదాయేం రాధమ్మా అంటూ

వూరగాయలు, వడియాలు, అప్పడాలు పెట్టింది. ''అన్నీ కొంటామ''
అంటుంది రాధమ్మ. ''కొన్నవి మనం పెట్టుకున్నట్లుంటాయా? యేవీ చూస్తాను''
అని అవీ తనుపెట్టినవీ సీసాల్లోను పొట్లాల్లోను సర్ది జండా పీకేస్తుంది జై పరమేశ్వరా అంటూ రాధమ్మ నోరుబడిపోయినట్టు చూస్తూ వుండిపోతుంది.

యే యింట్లో నైనా జొరబడగానే, అగౌరవం కంటబడగానే తనిష్టమొచ్చినట్టుండనీయక అడ్డుపడినా, ఛర్రున కైజారు పైకి తీస్తుందత్తయ్య'' ఇదేమిటే రాధా! నేతది బట్టవిప్పి పొడిబట్టకట్టుకుంటున్నంతసేపూ అటుగా వస్తారేం పినవాళ్లూ మీరంతానూ? చిన్న ముండనా, చితకముండనా? వయసు మళ్లిపొయెగా'' అని గొంతు చించుకుంటుందత్తయ్య. రైలు ఛార్జీలు వడేసి లాగి రైలెక్కుతుంది. చిత్రమేమిటంటే తండాతో వచ్చివేస్తున్నప్పుడు తప్పుపట్టదత్తయ్య. కలుపుగోలుతనం ఆపేక్షా ఒలకపోస్తుంది''.

తక్కిన కితాబులు వింటున్న కుముదిని, ''టీ వేళైంది పిన్నీ. కబుర్లు వింటూంటే పని తెలిగ్గాతోచింది. టీ స్నాకుస్సా తెస్తాను. ఇలా కూచుని యీ ఫామిలీ ఆల్బమ్ చూడు పిన్నీ. పోలారాయిడ్ ఫొటోలూ, కంప్యూటర్ సాయంతో తీసినవీ అన్నీ వర్ణచిత్రాలే'' అని ముందుంచి లోపలికెళ్లింది. గోడగడియారం వంక చూడలేదు. అయిదున్నర అయింది. ఈకలబ్రష్‌తో తుడిచింది.

అన్నీ చేసి అమర్చి తెచ్చేప్పటికి ఇరవై నిమిషాలు పట్టింది. వేఫర్స్, బిస్కట్లు, కేకుముక్కలు రెండు, ఆపిల్ ముక్కలు చిన్నవి సాసర్లో, బొప్పాయి పండుముక్కలూ మరో సాసర్లో, స్పూన్లు రెండు టీ కప్పులూ సాసర్లూ, ట్రేతో వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో చూస్తే పిన్ని లేదు. గాలికి కర్టెన్లు కదులుతున్నాయి. కాగితం మీద వ్రాసి పేపర్ వెయిట్ వుంచిన వుత్తరం లాంటిది కనిపిస్తే ట్రే బల్లమీదుంచి చదివింది కుముదిని.

''నా వాగుడు నిజం కాకపోతే చెవి కదపాయించుకుంటాను కుముదినీ. మతం మార్చుకుంటా. ఫామిలీ ఆల్బమ్ తిరగేస్తే పోలికలు దగ్గర అని తేలింది. సారీ కుముదినీ! నీ మనస్సుకు నొప్పి కలిగించానేమో. ఆమె నీకు ఆత్మీయురాలేమో. ఆమె తత్త్వం నీకు తెలిసే వుండాలి. ప్రేమాగౌరవాలు

మన్నించమని చెప్పాయేమో పిన్ని!'' అని వున్నది.

పిల్లలూ భర్తా వచ్చేశారు ''యెవరి కోసం యివన్నీ'' అన్నాడు చంద్రశేఖరం. జవాబివ్వలేదు కుముదిని. వాళ్లే పూర్తి చేశారు.

పనీ భోజనాలు. రాత్రి పదైంది.

మర్నాడు సాయంకాలం గానీ కుముదినికి సెకండ్ ఫ్లోర్‌లో రెండో నంబరు అపార్ట్‌మెంటుకి వెళ్లేందుకు తీరిక చిక్కలేదు.

బెల్‌నొక్కితే, కొత్త మొహం తలుపుతీసింది.

'' ఈ అపార్ట్‌మెంటులో సుమిత్రాదేవి లేరండీ?'' అన్నది కుముదిని.

''మేడమ్! సారీ! ఈ అపార్ట్‌మెంటులో నే నొక్కడినే వుంటున్నాను. మీరు పేర్కొన్నవారు లేరు. నేను కళ్లజోళ్ల వ్యాపారం చేస్తున్నాను. మొత్తం బిల్డింగ్‌లో మీరన్నవారు లేరేమో, బోర్డు గమనించలేదా?'' అన్నాడు.

''గమనించలేదు. సారీ!'' అన్నది విస్తుపోతూ.

''రండి. యిప్పుడన్నా పేర్లు చదువుదురు గాని'' లైట్లు వెలిగినై. మర్యాదస్తుని లాగా వెంటబెట్టుకెళ్లాడు. బేస్‌మెంటులో పేర్లు గిల్టు అక్షరాలలో బిగించబడిన నల్లరాతి మీద మెరిసినై. వరసన చదివింది. వాచ్‌మన్ వచ్చాడు. వాళ్లిద్దర్నీ వెర్రిచూపులు చూసి లిఫ్టువేపు పరుగెత్తి లోపలికెళ్లింది. లిఫ్టు లేస్తున్నది. రెడ్‌బటన్స్ చూస్తున్నది. నంబర్లు చూస్తున్నది. పిన్ని ధోరణి రింగ్‌రింగ్ మంటున్నది చెవులల్లో.

''దంపతులే సఖ్యంగా వుంటే నేరాలు చెప్పి విడదీస్తుంది. విడిపోతే ధర్మపన్నం వల్లిస్తూ ''యెక్కడుండాల్సిన వారక్కడుండాలని, తీసికెళ్లి భర్తవద్ద వదిలేసి వెళ్లిపోతుంది. ఆమె నీకు తెలుసా? తప్పు చేస్తుంటే చూస్తూ వుంటుంది''. కుముదిని తన అపార్ట్‌మెంట్లో బెడ్‌రూమ్‌లో కెళ్లి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూచుని కర్చీఫ్‌తో మొహాన యేర్పడిన స్వేద బిందువులు అద్దింది. ''మెయిల్ చేసే అవకాశం కోసం చూస్తూ వుంటుంది. ఈమె మీకు తెలుసా?''